
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



ఏపీఈఏపీ సెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు విద్యార్థికి 3వ ర్యాంక్, తాడేపల్లిగూడెం విద్యార్థికి 5వ ర్యాంక్

పాలకొల్లు రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్‌లో పాలకొల్లు, తాడేపల్లిగూడెం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 3, 5 ర్యాంక్‌లు సాధించారు. పాలకొల్లుకు చెందిన వ్యవసాయ కూలీ కుమారుడు యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంక్ సాధించాడు. జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఈడబ్ల్యూ కేటగిరిలో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. ఓపెన్ కేటగిరిలో 53వ ర్యాంక్ సాధించాడు. తాడేపల్లిగూడెంలో ప్రముఖ వైద్యుడు యలమోలు రామకృష్ణ కుమారుడు సత్య వెంకట్ ఏపీఈఏపీసెట్ అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో 5వ ర్యాంక్ సాధించాడు.

నీట్ నా లక్ష్యం : సత్య వెంకట్



నాన్న రామకృష్ణ తాడేపల్లిగూడెంలో ప్రముఖ వైద్యులు, ఆయన నడిచిన దారిలోనే వెళ్లాలన్నది నా కోరిక. చిన్నప్పటి నుంచి ఆ కలలతోనే చదివాను. వైద్య కోర్సు ప్రవేశానికి నీట్ రాశాను. ఏపీఈఏపీ సెట్‌లో రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. ఇదే ఉత్సాహంతో అనుకున్నది సాధిస్తాను.

ఇంజనీరింగ్‌లో 8,330 మంది, అగ్రికల్చర్, ఫార్మసీలో 3360 మంది ఉత్తీర్ణత

భీమవరం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ - 2025 పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఇంజనీరింగ్‌లో 5,806 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 4,182 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థినుల్లో 5522 మంది పరీక్ష రాయగా 4148 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 11,328 మంది విద్యార్థులకుగాను 8,330 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు అయ్యింది. అగ్రికల్చర్, ఫార్మసీలో 802 మంది బాలురు పరీక్ష రాయగా 708 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 2910 మంది పరీక్ష రాయగా 2652 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 3712 మంది విద్యార్థులకు 3360 మంది విద్యార్థులు ఉత్తీర్ణతగా నిలిచారు.

సీట్ల భర్తీ పెరిగే అవకాశం..

ఇంజనీరింగ్ కళాశాలలకు ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 15 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా కన్వీనర్ కోటా సీట్లు 8 వేలు పైగా ఉన్నాయి. పశ్చిమలో 8330 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏలూరు జిల్లాలో 3409 మంది ఉత్తీర్ణత సాధించారు. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయని అంచనా. గత ఏడాది కూడా ఇంజనీరింగ్ సీట్ల భర్తీ యాజమాన్యాలకు కొంత ఊరట నిచ్చింది. ఈ ఏడాది ఏపీ ఈఏపీ సెట్ ఎక్కువ మంది విద్యార్థులు రాయడం, ఇంజనీరింగ్ కళాశాలల సీట్ల భర్తీకి అవకాశాలున్నాయి.

100 పడకల ఆస్పత్రి


నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనం

పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వాసుపత్రి ప్రారంభానికి సిద్ధం అవుతోంది. భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదట 30 నుంచి 50 పడకల ఆసుపత్రిగా విస్తరించిన దీనిని 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ నిధులు మంజూరు చేసింది. కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా భవన నిర్మాణం జరుగుతోంది.

- ప్రారంభానికి సిద్ధం అవుతున్న భవనం
- పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం
- వారం వారం పర్యవేక్షిస్తున్న మంత్రి నిమ్మల
- ఆగస్టులో ముఖ్యమంత్రి చంద్రబాబుచే ప్రారంభించడానికి ఏర్పాట్లు

పాలకొల్లు అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనులు గతంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రారంభించగా 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. భవన నిర్మాణ పనులు అంతంతమాత్రంగా జరిగాయి. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు నిమ్మల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా నియమితులు కావడంతో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వంద పడకల ఆస్పత్రిలో ఆధునిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రి గుమ్మం వద్దకే తీసుకుని రావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆసుపత్రిని ఆగస్టులో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యసేవలు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

138 మంది సిబ్బంది

ప్రస్తుతం ఆసుపత్రిలో 138 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. సూపరింటెండెంట్, ఆర్ఎంవోతోపాటు ముగ్గురు గైనకాలజిస్టులు సహా 18 మంది వైద్యులు ఉన్నారు. 40 మంది నర్సింగ్ సిబ్బంది, ఎంఎన్‌వోలు 15 మంది, ఆరోగ్యశ్రీ సిబ్బంది ఆరుగురు, ల్యాబ్ టెక్నిషియన్స్, బ్లడ్ టెస్టింగ్ తదితరులు మరో 12 మంది శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది ఐదుగురు, ఆఫీసు సిబ్బంది ఆరుగురు ఉన్నారు.

పాలకొల్లులో 100 పడకల ఆసుపత్రి ప్రారంభమైతే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతోపాటు కోనసీమ జిల్లాలోని మరో నాలుగు నియోజకవర్గాల ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. పాలకొల్లు మీదుగా జాతీయ రహదారి వెళుతుండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగితే క్షత గాత్రులకు తక్షణ వైద్య సహాయం కూడా అందుబాటులోకి వస్తుంది.

ఇల్లు కట్టేదెలా..?



వైసీపీ ప్రభుత్వ పాలనలో శివారు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇప్పటికీ పూడిక చేపట్టలేదు. మరోవైపు గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇళ్లు కడతారా.. లేదా..? అంటూ నోటీసులు ఇవ్వడానికి సమాయత్తం అయ్యారు.

- నిర్మాణం చేపడతారా.. లేదా..?
- లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ తాఖీదు
- శివారు లోతట్టు ప్రాంతాల్లో నిర్మాణం ఎలా?
- ఎటూ తేల్చుకోలేని ఇళ్ల లబ్ధిదారులు
- రాయితీ పెంచినా నిరాసక్తత

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి ఆవాస యోజనలో గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు లబ్ధిదారులకు శాపంగా మారాయి. పట్టణాలకు దూరంగా, లోతట్టు ప్రాంతాల్లో సెంటు స్థలాన్ని కేటాయించారు. ఇప్పటికీ కొన్ని లేఅవుట్‌లను పూడిక చేపట్టలేదు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేవని ఆసక్తి చూపడం లేదు.

లబ్ధిదారు ఇల్లు నిర్మించుకోవాలంటే కనిష్ఠంగా రూ. 5 లక్షలు వ్యయం అవుతుంది. ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మాత్రమే ఇస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, బీసీ కేటగిరీ లబ్ధిదారులకు అదనంగా రూ. 50 వేలు పెంచారు. ఎస్టీలకు రూ.75వేలు అదనపు రాయితీ ప్రకటించింది. అయినా లబ్ధిదారుల్లో చలనం లేదు. ఇళ్లు నిర్మించుకోలేమన్న ఉద్దేశంతో ముఖం చాటేస్తున్నారు. ఇటీవల సచివాలయాల సిబ్బంది వివరాలు సేకరించారు. నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించారు. నిర్మాణాలు చేపట్టకపోడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. లిఖితపూర్వకంగా మరోసారి లబ్ధిదా రులకు నోటీసులు ఇవ్వనున్నారు. నిర్మాణాలు చేపట్టకుంటే తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆసక్తి చూపని లబ్ధిదారులు స్థలాలను రద్దు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

20 వేల మంది వెనకడుగు

జిల్లాలో ఇళ్లు కట్టుకోలేని లబ్ధిదారులు 20వేల మంది ఉన్నారు. వాస్తవానికి ప్రధానమంత్రి ఆవాస యోజనలో 72 వేల ఇళ్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు దాదాపు 11వేల ఇళ్లు నిర్మించాల్సి ఉంది. మరో 20 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. భీమవరం, తణుకు లేఅవుట్‌లలో ప్రభుత్వం ఇప్పటి వరకు పూడిక చేపట్టలేదు. ఇదికూడా లబ్ధిదారులు వెనుకంజకు కారణమైంది. మరోవైపు తణుకు పట్టణంలో లబ్ధిదారులకు ఏడు కిలోమీటర్ల దూరంలోని లోతట్టు భూముల్లో స్థలాలు ఇచ్చారు. దాంతో పెద్ద మొత్తంలో వెచ్చించి నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

పిట్టగూడులా ఇళ్లు

పట్టణ ప్రాంత లబ్ధిదారులకు సమీప పల్లెల్లో సెంటు స్థలం కేటాయించారు. పిట్టగూడుల్లా ఇళ్లు నిర్మించుకోవాల్సి వస్తోంది. దాంతో కొందరు లబ్ధిదారులు తమ స్థలాలను ఇతరులకు విక్రయించేశారు. దళారులు మధ్యవర్తులుగా ఉన్నారు. లబ్ధిదారుని పేరుతో ఇళ్లు ఉన్నా ఇతరులకు ఇల్లు వెళ్లిపోయింది. ఇంకొందరు నిర్మాణానికి సొమ్ము లేదని వెనుకడుగు వేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ రాయితీని రూ.2.30 లక్షలకు పెంచింది. ఎస్సి, బీసీలకు మాత్రమే వర్తింపజేసింది. అగ్రకులాల్లో పేదలకు అది కూడా లేదు. రాయితీ పెంచినా సరే ఇళ్ల నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దాంతో హౌసింగ్ కార్పొరేషన్ లబ్ధిదారులకు నోటీసులు జారీచేసేందుకు సిద్ధమవుతోంది.


భీమవరం సీఐకు ఫిర్యాదు ఇస్తున్న తోట సీతారామలక్ష్మి, మంతెన

మహిళాగ్రహం

మహిళలను కించపరుస్తూ అమరావతి వేశ్యల రాజధానిగా వ్యాఖ్యానించిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ నాయకులు, మహిళలు డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత జగన్ పత్రికలో అవమానకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్‌లు, పత్రికా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో పలుచోట్ల సోమవారం పత్రిక ప్రతులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

7


ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న చించినాడ బ్రిడ్జి

ఎండ ప్రచండం

యలమంచిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, వడగాడ్పులతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. సోమవారం ఉదయం 11గంటల తరువాత బయటకు రావడానికి ప్రజలు భయపడ్డారు. ఎండలకు తోడు తీవ్రమైన ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత, ఉక్కపోత ధాటికి అధికశాతం ప్రజలు మధ్యాహ్నం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉభయగోదావరి జిల్లాలను అనుసంధానిస్తూ ఉన్న చించినాడ బ్రిడ్జి (216 జాతీయ రహదారి), మండలంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ పురస్కారాలు

భీమవరం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్ విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏఎస్ఆర్ సాంస్కృతిక కేంద్రంలో సోమవారం షైనింగ్ స్టార్ పురస్కారాలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారిని సన్మానించి పురస్కారం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 20 మండలాల నుంచి 119 మంది పదో తరగతి విద్యార్థులు, ప్రభుత్వ కళాశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. వారందరికీ సర్టిఫికెట్, మెడల్, రూ.20 వేలు చెక్కు రూపంలో అందజేసి అభినందించడం జరుగుతుందన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాలు

భీమవరం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద సోమవారం యోగా కార్యక్రమం జరుగతుందన్నారు. యోగాపై విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేసినట్లు వివరించారు. వశిష్ట గోదావరి వలంధర్ రేవు, పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో యోగా కార్యక్రమాలను పూర్తిచేశామన్నారు. సోమవారం భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద, 16న పేరుపాలెం బీచ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం అన్ని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలలో ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ప్రతి సచివాలయ స్థాయిలో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య



- విద్యాహక్కు చట్టం మేరకు ప్రవేశాలు
- ఈ నెల 10 వరకు పాఠశాలల్లో విద్యార్థులు చేరడానికి గడువు
- జిల్లాలో 247 ప్రైవేట్ పాఠశాలలు
- మొదటి విడత 912 సీట్ల కేటాయింపు

భీమవరం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో చేరడానికి ప్రభుత్వం గడువు పొడిగించింది. మూడు విడతల ప్రవేశాలకు మొదటి విడత ప్రవేశాలకు ఈ నెల 7 వరకు నిర్ణయించారు. 7, 8 తేదీలు సెలవు రావడంతో ఈ నెల 10 వరకు గడువు పొడిగించారు. జిల్లాలో 399 ప్రైవేటు పాఠశాలలు ఉండగా విద్యాహక్కు చట్టం ప్రవేశాలకు 247 పాఠశాలలు అందుబాటులో ఉంచారు. మొదటి విడత 912 విద్యార్థుల ప్రవేశాలు ఇవ్వనున్నారు. గత ఏడాది మూడు విడతలుగా కలిపి 1369 మంది విద్యార్థులు చేరారు. ఈ విద్యా సంవత్సరంలో మొదటి విడతలోనే 912 సీట్లు కేటాయించడంతో మిగిలిన రెండు విడతలలో పెరుగుతారని జిల్లా విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలోనే పశ్చిమ గోదావరి జిల్లాలోనే విద్యా హక్కు చట్టం ప్రవేశాలు ఎక్కువని అధికారులు చెబుతున్నారు. సుమారుగా 2500 మంది విద్యార్థుల వరకు చేరేందుకు సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది

పేద విద్యార్థులు విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుంది. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు పాఠశాలలో అందుబాటులో ఉన్న తరగతి వరకు ఫీజు లేకుండా చదువుకోవచ్చు. అర్బన్ పరిధిలో రూ.8 వేలు, రూరల్ పరిధిలో రూ.7 వేలు, ఏజెన్సీ పరిధిలో రూ.50 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది.

కొన్ని పాఠశాలల్లో అడ్డంకులు

విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు కొన్ని పాఠశాలల్లో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. విద్యా సంవత్సరం సగం, చివరి పరీక్షల సమయంలో ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు తల్లిదండ్రులను డిమాండ్ చేసేవారు. 2023-24 సంవత్సరంలో విద్యా హక్కు చట్టంలో చదువుతున్న విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖాధికారికి విన్నవించుకున్నారు. ఫీజుల విషయమై ప్రైవేట్ పాఠశాలలు అనుకూలంగా వ్యవహరించాలి.


లంకలకోడేరులో రైతులకు కృషి ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న మంత్రి రామానాయుడు, చిత్రంలో కలెక్టర్ నాగరాణి, జేడీ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

రైతులకు ప్రభుత్వం అండ : నిమ్మల

పాలకొల్లు రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అహర్నిశలూ కష్టపడే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. లంకలకోడేరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50శాతం సబ్సిడీతో 80మంది రైతులకు కృషి ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను కలెక్టర్ నాగరాణి, జేడీ జడ్ వెంకటేశ్వరరావు, మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు ఆదివారం పంపిణీ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారమార్గం చూపుతుందన్నారు. ఏడీఏ పార్వతి, కేవీకే ఉండి శాస్త్రవేత్త మల్లికార్జునరావు, ఏవోలు రాజశేఖర్, జి.సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, పెన్మెత్స వెంకట రామసూరి, నెక్కంటి ఆదినారాయణ, పెన్మెత్స వెంకటసత్యనారాయణరాజు, పాముల రజనీకుమార్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సర్వే



భీమవరంలో వీధి వ్యాపారుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

మునిసిపాల్టీ	లక్ష్యం
నరసాపురం	1230
పాలకొల్లు	3825
భీమవరం	3937
తణుకు	2289
తాడేపల్లిగూడెం	2860

- హైకోర్టు ఆదేశాల మేరకు మరోసారి సర్వే
- వెండర్ కనెక్ట్ యాప్‌లో వివరాల నమోదు
- క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగి, మెప్మా సిబ్బంది
- మునిసిపాలిటీ గుర్తింపు కార్డు, సర్టిఫికెట్

భీమవరం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి వడ్డీ వ్యాపారుల బారి నుంచి కాపాడేందుకు పట్టణాల్లో మరోసారి సర్వే కొనసాగుతోంది. 2017లో సర్వే పూర్తిచేసి వ్యాపారులకు పీఎం స్వనిధి కింద జిల్లా వ్యాప్తంగా 13వేల మందికి మెప్మా అధికారులు రుణాలు మంజూరు చేయించారు. ఇటీవల హైకోర్టు మరోసారి వీధి వ్యాపారుల సర్వే చెయ్యాలని ఆదేశించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే జరుగుతోంది. పట్టణాల్లో వీధి వ్యాపారులను నమోదు చేయాల్సి ఉంటుంది.

వెండర్ కనెక్ట్ యాప్ ద్వారా

ప్రస్తుతం సర్వే వెండర్ కనెక్ట్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో మెప్మా సిబ్బంది మాత్రమే పట్టణాల్లో వీధి వ్యాపారులను గుర్తించి నమోదు చేశారు. ఈ సారి వీరితోపాటుగా వార్డు సచివాలయ అడ్మిన్‌లను కూడా సర్వేలో భాగస్వాములను చేశారు. ఆయా పట్టణాల్లో వార్డు సచివాలయ ఉద్యోగులు సర్వే చేస్తున్నారు. గతంలో చేపట్టిన సర్వేలో నమోదైన వీధి వ్యాపారులతో పాటు, పీఎం స్వనిధి రుణాలు తీసుకుని సర్వేలో నమోదు కాని వారిని గుర్తిస్తున్నారు. కొత్తగా ఎవరైనా వీధి వ్యాపారులు ఉన్నారా అనేది పరిశీలిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ఆకివీడు మునిసిపాల్టీకి మాత్రం లక్ష్యాలను నిర్దేశించలేదు. సర్వే మాత్రం నిర్వహించి వీధి వ్యాపారులను గుర్తిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

సర్వేలో నమోదైన వీధి వ్యాపారులకు మునిసిపాల్టీల ద్వారా గుర్తింపు కార్డు, సర్టిఫికెట్ అందిస్తారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూస్తారు. తద్వారా ఆర్థికంగా బలోపేతానికి అవకాశం ఏర్పడుతుంది.

బదిలీల సంక్షోభంపై మంత్రి లోకేశ్ జోక్యం చేసుకోవాలి
ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్
శుభకార్యాలకు బ్రేక్
రేపటి నుంచి మూఢం..
7
భక్తులతో కిటకిటలాడిన చిన వెంకన్న ఆలయం
నేడు మావోయిస్టు అగ్రనేత సుధాకర్ అంత్యక్రియలు
మెయిన్‌లో


ఏలూరు డీఈవో కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బదిలీల సంక్షోభంపై మంత్రి లోకేశ్ జోక్యం చేసుకోవాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీల్లో నెలకొన్న సంక్షోభంపై విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ వెంటనే జోక్యం చేసుకుని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఏపీ టీచర్స్ అసోసియేషన్ జేఏసీ ఉమ్మడి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈవో కార్యాలయం వద్ద నిర్వహించిన ముట్టడి కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి మాట్లాడుతూ తాజాగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో పలు సమస్యలు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా ఎస్జీటీ కేడర్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని గతనెల 19, 20 తేదీల్లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో జరిపిన చర్చల్లో విద్యాశాఖ కమిషనర్ హామీ ఇచ్చారని, దీనికి భిన్నంగా ఇపుడు బదిలీ స్థానాలకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వాల్సిందిగా వెబ్‌సైట్‌లో ఎనేబుల్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం ఉపాధ్యాయులను మోసం చేయడమేనని ఆరోపించారు. గతంలో జరిగిన వెబ్ ఆప్షన్లలో తలెత్తిన చేదు అనుభవాలను టీచర్లు ఇప్పటికీ మర్చిపోలేదని, మళ్లీ ఇపుడు అదే విధానాన్ని బలవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సెలింగ్‌ను అనుసరించడానికి విద్యాశాఖకు ఎందుకు అభ్యంతరమో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెబ్ ఆప్షన్లు ఇస్తే ఒక్కో ఎస్జీటీ సుమారు 2 వేలకుపైగా స్థానాలకు అభీష్టాన్ని తెలియ జేయాల్సి ఉంటుందన్నారు. ఇది తీవ్ర మానసిక ఒత్తిడికి దారితీస్తుందని వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌లో పెద్దసంఖ్యలో తప్పిదాలు వెలుగులోకి వచ్చాయని, వీటిని పరిష్కరించడానికి పెట్టిన అర్జీలను పట్టించుకునే వారేలేరని ఆరోపించారు. పికెటింగ్ అనంతరం డీఈవో వెంకట లక్ష్మమ్మను కలుసుకుని చర్చలు జరిపారు. బదిలీలపై సందేహాలను నివృత్తి చేయడానికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ఏలూరు డీఈవో కార్యాలయంలో ఎవరిని సంప్రదించాలో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి భీమవరం డీఈవో కార్యాలయం నుంచి కొందరు సిబ్బందిని ఉమ్మడి జిల్లా డీఈవో కార్యాలయమైన ఏలూరులోని హెల్ప్‌డెస్క్‌కు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యేవరకు డిప్యుటేషన్లపై నియమించాలని ఎమ్మెల్సీ గోపిమూర్తి డీఈవోకు సూచించారు. యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, అలీ, రవికుమార్, రామభద్రం, రాంబాబు, రంగమోహన్, శివశంకర్, మోహన్‌రావు, ఏపీటీఎఫ్ నాయకులు పట్టాభిరామయ్య, ఎస్టీయూ నుంచి శ్రీనివాస్‌వర్మ, రాజశేఖర్, క్రాంతికుమార్, ఏపీటీఎఫ్-1938 నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ముందస్తు జాగ్రత్తగా డీఈవో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లే..


ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న సెకండరీగ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీ) వెబ్ ఆప్షన్ల విధానంలోనే ఆయా వెకెన్సీలకు అభీష్టాన్ని తెలియజేసే ప్రక్రియను విద్యాశాఖ ఆదివారం ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో 2 వేల మందికి పైగా ఎస్జీటీలు సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకోగా,వీరిలో తొలి 500 మంది వెబ్‌ఆప్షన్లు ఇచ్చేందుకు ఆదివారం రోజంతా గడువునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదేరీతిన వెబ్‌ఆప్షన్ల పద్ధతిని అనుసరిస్తున్నట్టు విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి. సీనియార్టీ జాబితాల్లో తదుపరి మరో 500 మంది ఎస్జీటీలు అందుబాటులో వున్న వేకెన్సీలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు ఆదివారం రాత్రి సమాచారం ఇచ్చే అవకాశం ఉందని వివరించాయి. రోజుకు 500 మంది చొప్పున వెబ్‌ఆప్షన్లు ఇచ్చేలా నిర్ణయించారు. కాగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు చేయాలని తమకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం అందలేదని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్ర కార్యదర్శిగా మూడోసారి భూపతిరాజు రవీంద్రరాజు



ఏలూరు రూరల్ /భీమవరం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భూపతిరాజు రవీంద్రరాజు మూడోసారి ఎన్నికయ్యారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రవీంద్రరాజును నియమించారు. ప్రస్తుతం ఆయన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బంగారయ్య, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మోహనరావు, ప్రధాన కార్యదర్శి జకరయ్య, ఏలూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు సుబ్బారావు, రవికుమార్, అక్బర్, వెంకటేశ్వరరావు, అజయ్, అడపా రాంబాబు, పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కెనడీ, సత్తిబాబు, సురేష్, చెల్లయ్య, ముత్యాలు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, బి.సుగుణమ్మ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగసాయి అభినందనలు తెలియజేశారు.

అలరించిన శ్రమకావ్యం.. గానం


మాట్లాడుతున్న రచయిత సుద్దాల అశోక్ తేజ

ఏలూరు కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో సీఐటీయు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ నిర్వహించిన 'శ్రమకావ్యం' గానం సభికులను ఆకట్టుకుంది. సమాజ పరిమాణం, అభివృద్ధిలో శ్రమ పాత్రే కీలకమైనదని అశోక్‌తేజ వివరించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షతన నిర్వహించిన శ్రమకావ్యం గాన సభలో రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రమకావ్యం పుస్తకంలో అనేక ఘట్టాలను ఆలపిస్తూ సవివరంగా విశ్లేషించారు. శ్రమకావ్యం రచనలో శ్రమను వస్తువుగా తీసుకుని రచన చేయడం సాహసోపేతమని రిటైర్డ్ రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంపద సృష్టికర్తలైన కార్మికుల శ్రమను తక్కువ చేస్తే కార్పొరేట్‌లే సంపద సృష్టికి మూలమని ప్రస్తుత పాలకులు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని సీఐటీయు దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తుందన్నారు.జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ అత్యంత సరళంగా సామాన్య పాఠకులకు అర్థమయ్యే విధంగా శ్రమకావ్యం రచించారని అన్నారు.


ప్రత్తిపాడు సాక్షి కార్యాలయం వద్ద సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు


ఆచంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు


తణుకు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళ నాయకులు

మహిళాగ్రహం

అమరావతి ప్రాంతంలోని మహిళలపై సాక్షి ఛానల్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ ఆదివారం ఉమ్మడి జిల్లా పరిధిలో పలు స్టేషన్లలో అనేకమంది ఫిర్యాదులు చేశారు. మహిళలను కించపరిచిన వారిని శిక్షించాలంటూ నిరసన ర్యాలీలు చేశారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, చింతలపూడి, లింగపాలెం, తణుకు, నరసాపురం, ఆచంట, ఆకివీడు పోలీస్‌స్టేషన్లలో మహిళలు ఫిర్యాదు చేశారు. పెంటపాడు సాక్షి కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపి ఆ పత్రిక ప్రతులను చించివేశారు.

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

పెంటపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజధాని మహిళలను కించపరుస్తూ మాట్లాడటం హేయమని జిల్లా తెలుగుదేశం పార్టీ తెలుగుమహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ప్రత్తిపాడు సాక్షి కార్యాలయం వద్ద తెలుగు మహిళలు నిరసన చేపట్టారు.తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దాసరి కృష్ణవేణి మాట్లాడుతూ రాజధానిపై అసభ్యకరంగా మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస రావులపై కేసు నమోదు చేయాలని, సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం సాక్షి ప్రతులను దహనం చేశారు. తమరపు రమణమ్మ, రేవతి చిన్నా యమ్మ, స్వర్ణలత, వరలక్ష్మి , కొల్లి రమావతి తదితరులు పాల్గొన్నారు.

- **తణుకు :** అమరావతి ప్రాంత మహిళలనుద్దేశించి నీచంగా మాట్లాడిన పేటీఎం జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని తణుకు నియోజకవర్గ తెలుగు మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ కె.ప్రసాదు, ఏఎస్ఐ రాజ్యలక్ష్మిలకు ఫిర్యాదు చేశారు.
- **నరసాపురం టౌన్ :** అమరావతి వేశ్యల రాజధాని అని మహిళల్ని కించపర్చుతూ సాక్షి మీడియాలో ప్రచారమైన డిబేట్‌పై టీడీపీ మహిళా విభాగం మండిపడింది. పార్టీ పట్టణ అధ్యక్షురాలు కొలిచెన పద్మ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సై జయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. పెమ్మాడి శశి, బేగం, నాగమణి, విజయలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.
- **ఆచంట :** అమరావతి రాజధానిపై మహిళలపై తప్పుడు వాఖ్యలు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆచంట పోలీసు స్టేషన్‌లో ఆచంట నియోజకవర్గ మహిళలు పిర్యాదు చేశారు. జర్నలిస్టులు, సాక్షి టీవీ చానల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మన్నె రాధిక, బీరా తిరుపతమ్మ, చిలుకూరి సత్యవతి, ఎం.విజయలక్ష్మి, కె.స్వర్ణకుమారి, వి.రాధా, కేతా అరుణ తదితరులు పాల్గొన్నారు.
- **పాలకొల్లు టౌన్ :** పాలకొల్లు పట్టణంలోని తెలుగు మహిళలు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. రాష్ట్ర మహిళలకు భారతిరెడ్డి, జగన్మోహనరెడ్డిలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ పృధ్వీకి ఫిర్యాదు అందజేశారు. పెండ్యాల భవాని, ఎస్తేరు రాణి, బేతు నాగలక్ష్మి, దేవగానుగుల వరలక్ష్మి, సంఘాల విజయలక్ష్మి, తాళ్లూరి విజయలక్ష్మి, తాళం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.
- **ఆకివీడు :** రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడమంటే ఏపీ మహిళలందరినీ అన్నట్టేనని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- **ఏలూరు టూటౌన్ :** వైసీపీ, సాక్షి మీడియా రాష్ట్ర మహిళల మనోభావాలతో దారుణంగా ఆడుకుంటుందని జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు సాక్షి దినపత్రిక కార్యాలయం వద్ద తెలుగు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల సునీత మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం ఇంత నీచానికి దిగజారిన జగన్ వైఖరిని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. అనంతరం సాక్షిదినపత్రికను దహనం చేశారు.జిల్లా అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి, వై.శ్యామల, ఎం.రామతులసి, సంతోషి, వడ్డి వాసవిదేవి, వేముల రంగమ్మ, తవ్వా అరుణకుమారి, జే.వెంకటరమణ, ఉషారాణి, జయంతి, రమాదేవి, జానకి, సరిత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం త్రిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- **చింతలపూడి :** కూటమి ఆధ్వర్యంలో చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య, జనసేన అధ్యక్షులు చీదరాల మధుబాబు, బిజెపి పట్టణ అధ్యక్షురాలు విజయకుమారి, పట్టణ టీడీపీ అధ్యక్షులు తాటి అప్పారావులు ఫిర్యాదు చేయగా కూటమికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** తడికలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబుల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు గొంతు వెంకటేశ్వరరావు, బొబ్బిలి డాన్ దివాకర్, మేరుగు సుందరరావు, యలమాటి నాగేశ్వరరావు, సూరం సుధీర్, బలుసు సాయి, కిరణ్, కొలుకులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గరిమల చలపతిరావు ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు ఇళ్లలో కూడా ఆడవాళ్ళు ఉంటారనే విషయాన్ని వారు మర్చిపోయారా అంటూ నిలదీశారు. చెరువుగట్టు రామోహ్మన్‌రావు, మోరంపూడి ప్రసాద్, పల్లి శ్రీను, గజ్జ వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ సుధాకర్ పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** సాక్షి టీవీ ఛానెల్లో అమరావతి మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడి అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జబీర్‌కు కూటమి మహిళలు ఆదివారం ఫిర్యాదు చేశారు.కూటమి మహిళలు పీసుపాటి రామలక్ష్మి, పగడం సౌభాగ్యవతి, గురుజు ఉమామహేశ్వరి తెలగారపు జ్యోతి, గుళ్లపూడి శ్రీదేవి, మారిశెట్టి బాల చిట్టెమ్మ, రాజీ, టి.సుమలత, నాయకులు చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, పాతూరి అంబేద్కర్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని లక్కవరం పోలీస్ స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు.
- **కొయ్యలగూడెం :** అమరావతి రాజధాని మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, మండల మహిళా ప్రధాన కార్యదర్శి రమాదేవి, మండల మహిళా అధ్యక్షురాలు ఆకుల అరుణ, కొత్తా రమా, ఆరేటి వీరపండు, బొబ్బర రాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై విష ప్రచారమా ?

భీమవరం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరుస్తూ అమరావతి వేశ్యల రాజధానిగా వ్యాఖ్యానించిన వారిని కఠినంగా శిక్షించాలని భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు టీడీపీ మహిళలు, నాయకులు ఆదివారం పిర్యాదు చేశారు. టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ అమరావతి రాజధాని మహిళలు, ప్రజలను కించపరుస్తూ సాక్షి టీవీలో మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్, సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. అమరావతి ప్రాంతంపై మితిమీరిన విద్వేషంతో వైసీపీ నాయకులు సైకోలుగా మారి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి మహిళలను, ప్రజలను అవమానపరిచేలా మాట్లాడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ఇంటితోపాటు రాష్ట్రంలో ప్రముఖ నాయకుల గృహాలన్నీ అమరావతి ప్రాంతంలోనే ఉన్నాయని గుర్తు పెట్టుకోవాలన్నారు. టీడీపీ కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము మాట్లాడుతూ చరిత్ర తెలియని అజ్ఞానంతో అమరావతిపై ఇష్టారీతిన దుష్ప్రచారం చేయిస్తున్నారని, వైజాగ్‌లో భూములు కొట్టేసినట్లుగా అమరావతిలో కొట్టేయడానికి వీలు పడకపోవడంతో అమరావతిపై కక్షకట్టి జగన్ ఇలా ప్రవర్తిస్తున్నారన్నారు. తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, భీమవరం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కోళ్ళ సీతారాం, టీడీపీ నాయకులు మెంటే గోపి, ఎద్దు ఏసుపాదం, మైలాబత్తుల ఐజాక్‌బాబు నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ధర్మాజీగూడెంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు, మహిళలు


జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్‌కు ఫిర్యాదు అందిస్తున్న కూటమి మహిళలు


కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శుభకార్యాలకు బ్రేక్

రేపటి నుంచి మూఢం..

రానున్న నెలన్నర విశ్రాంతి

ద్వారకాతిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్ల సీజన్‌లో గురుమౌఢ్యమి జొరపడటంతో కొన్నాళ్లు వివాహాది శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. దీంతో శుభ కార్యాల్లో సందడి చేసే డోలు, సన్నాయిలు మూగ బోనున్నాయి. మాంగల్యం తంతునానేనా... అంటూ పెళ్లి మంత్రాలు చదివే పురోహితులు రానున్న నెలరోజుల పైబడి మౌనవ్రతం చేపట్టాల్సిందే.. వంటమేస్త్రి, పూల అలంకరణ చేసేవాళ్లు, కాటరింగ్ సిబ్బంది, లైటింగ్ డెకరేషన్ వారు, కల్యాణమండపాల యజమానులు ఈ కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సిందే. ఈనెల 10న గురుమౌఢ్యమి ప్రవేశించడంతో పాటు 26 నుంచి వచ్చేనెల 24 వరకూ ఆషాడమాసం శూన్యమాసం కావడంతో దాదాపు నెలన్నర పాటు శుభకార్యాలకు బ్రేక్ పడనుంది.

అట్టహాసంగా పెళ్లిళ్లు

చినవెంకన్న ఆలయ పరిధిలో ఈ జ్యేష్టమాసంలో ఆఖరి ముహూర్తం కావడంతో ఆదివారం ఉదయం నుంచి పెళ్లిళ్లు ఎక్కువగానే జరిగాయి. ఆలయ అనివేటి మండపం, ఆలయ పాత కల్యాణమండపం, పలు ప్రైవేటు కల్యాణమండపాలు వివాహాది శుభకార్యాలకు వేదికలయ్యాయి. రాత్రి సైతం వివాహాలు జరగడంతో క్షేత్రంలో పెళ్లిసందడి నెలకొంది.

ముంచుకొస్తున్న మూఢమి

ఈనెల 10 నుంచి వచ్చేనెల 8 వరకూ గురు మౌఢ్యమి కావడంతో వివాహాది శుభకార్యాలు జరుగవని పురోహితులు గోవిందవఝుల వెంకట రమణమూర్తిశర్మ చెబుతున్నారు. ఈ జ్యేష్టమాసంతో మూఢమి రాకుంటే మరో 15 రోజులు పాటు వివాహాది శుభకార్యాలు జరిగేవి. అయితే మూఢమి జొరపడటంతో ఇలా పెళ్లిళ్లు లేనట్టేనని వివరించారు. ఆ తరువాత ఆషాడ మాసం రావడం అది శుభకార్యాలకు శూన్యమాసం కావడంతో వచ్చేనెల 26 నుంచి శ్రావణమాసంలో వివాహాలు, ఇతర శుభకార్యాలు ప్రారంభమవుతాయని శర్మ వివరించారు.


పాత కల్యాణ మండపంలో వివాహ సందడి


ద్వారకా తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

కిటకిటలాడిన చిన్న తిరుపతి

ద్వారకాతిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. సెలవు రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. మొక్కుబడులు తీర్చుకుని స్వామి దర్శనానికి బారులు తీరారు. శ్రీవారిని దర్శించేందుకు సామాన్య భక్తులకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం లైన్లలో ఉన్న భక్తులకు సేవాదళం సభ్యులు మంచినీరు అందజేశారు. దాదాపు పది వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

మృగశిర కార్తె..మార్కెట్‌లో జోరుగా చేపల విక్రయాలు


గణపవరం మార్కెట్‌లో జోరుగా చేపల విక్రయాలు

గణపవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా గణపవరంలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఆదివారం నుంచి మృగశిర కార్తె ప్రవేశించిన సందర్భంగా ఒక పక్క రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. పుడమితల్లికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. మరోపక్క మృగశిర కార్తె రోజున చేపలు తినాలనే ఆనవాయితీ ఉండటంతో చేపలు కొనుగోలుకు ఎగబాకారు. అయితే ఈ చేపలు తినాలనే సంప్రదాయం వెనుక ఎన్నో ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని చెబుతున్నారు. మృగశిర కార్తెలో రుతుపవనాల రాకతో వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటాయని ఈ చేపలు తినడంలో ఆరోగ్య సూత్రాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా జలుబు, ఉబసం, దగ్గు, ఆస్మా వంటి తదితర వ్యాధులు మృగశిర కార్తెలోనే ప్రారంభమవుతాయని అంటారు. చేపల్లో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ డి, ప్రోటీన్లు, జింక్, ఐరెన్, ఐయోడిన్ వంటి లవణాలు మానవశరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని పెద్దలు చెబుతున్నారు. దీంతో మృగశిర కార్తె రోజున చేపలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. శిలావతి రూ.160 - 170, కట్ల రూ.150, గడ్డిచేప కిలో రూ.180-200, కొర్రమేను రూ.300-350 చొప్పున విక్రయించారు దీంతో గణపవరం చేపల మార్కెట్‌లో విక్రయాలు జోరుగా సాగాయి. వినియోగదారులతో మార్కెట్‌లు కళకళలాడాయి.

రైలు ఢీకొని ఒకరి మృతి

భీమవరం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందినట్టు రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన కందుకూరి ఏడుకొండలు (46) ఆదివారం ఉదయం సమీపంలోని రైలు పట్టాలపై బహిర్భూమికని వెళ్తున్నాడు. అయితే ఆ సమయంలో వస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం



పాలకొల్లు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు 5వ వార్డు ఆంబోతుల వారి వీధిలో గుర్తు తెలియని 70 సంవత్సరాల వయసు ఉన్న వృద్ధుడి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి 108కి సమాచారం అందించారు. పాలకొల్లు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా పట్టణ సీఐ కె.రజని కుమార్ ఆదేశాలు మేరకు ఎస్ఐ జి.పృధ్వీ మృత దేహాన్ని స్థానిక పాలకొల్లు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

వీరవాసరం (భీమవరం టౌన్) జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం అండలూరు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. కాళ్ళమండలం బొండాడ గ్రామానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై అండలూరు వద్ద చర్చి టర్నింగ్ తిరుగుతుండగా ఓ లారీ ఢీకొనడంతో చిట్టజల్లి సత్యవతి (30) అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. భార్యభర్తలు ఇరువురు వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మాధవరం కామాక్షమ్మకు పూజలు



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : మాధవరంలో పునఃప్రతిష్ఠ చేసిన కామాక్షమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారికి గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు.




సార్వాకు సిద్ధం

ఆచంట, జూన్8(ఆంధ్రజ్యోతి): దాళ్వా పంట ఆశాజనకంగా పండడంతో పాటు అమ్మిన వెంటనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లోకి పడడంతో కూటమి ప్రభుత్వంలో రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ తరుణంలో ఈ ప్రాంత రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో నారుమడులు వేశారు. కొన్ని రోజుల్లోనే కాలువలకు నీరు వచ్చిన వెంటనే దమ్ము చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు.

తేలిపోతున్న చేపలు

» గొల్లలకోడేరులో అడుగంటిన మంచినీటి చెరువు
» ఎండ వేడిమికి చనిపోతున్న వైనం

పాలకోడేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గొల్లలకోడేరులో మంచినీటి చెరువు అడుగంటడంతో పాటు డ్రెయినేజీ నీరు కలవడంతో చెరువులోని చేపలు ఎండకు చనిపోయి తేలిపోతున్నాయి. చెరువు చుట్టూ చేపలు తేలిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ చేపలు తినేందుకు కొంగలు చెరువు చుట్టూ పహారా కాశాయి. తేలిపోతున్న చేపలను పంచాయతీ సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి సంచుల్లో ఏరి బయటకు తీస్తున్నారు. మంచినీటి చెరువులో నీరు అడుగంటడంతోపాటు చెరువును చేర్చి ఉన్న గృహాల నుంచి డ్రెయినేజీ నీరు చెరువులోకి రావడంతోనే చేపలు చనిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి సుజాత పంచాయతీ సిబ్బందితో ఎట్టకేలకు డ్రెయినేజీ నీరు చెరువులోకి రాకుండా ఇసుక బస్తాలను వేసి పటిష్టపరిచారు.



గొల్లలకోడేరు చెరువులో తేలిన చేపలు (ఇన్‌సెట్‌లో)చనిపోయిన చేపలు



యోగా ప్రచార భేరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. యోగాంధ్ర-25 కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో యోగాపై ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు యోగా, వ్యాయామంపై అవగాహన కల్పించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, సోమవారం అల్లూరి స్మృతి వనం వద్ద వేలమందితో యోగా ర్యాలీ, యోగాసనాలు జరుగుతాయని, అందరూ పాల్గొనాలని కోరారు.



వాకపల్లిలో ఆలయ శంకుస్థాపనలో గన్ని.. శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతి కృష్ణ

ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన

గణపవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలు అధికంగా నిర్మించేందుకు ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకు రావడం శుభపరిణామం అని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. వాకపల్లిలో ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం గణపవరం సమితి మాజీ ఉపాధ్యక్షుడు నందూరి గాంధీ, మాజీ జడ్పీటీసీ లీలావతి దంపతులచే శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణాజిల్లా పెదముత్తివి శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతులు కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ల సుబ్బారావు, తోట శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి

'మానవత' సేవలు అభినందనీయం

తణుకు/తణుకు రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని గమిని ఫంక్షన్ హాలులో తణుకు శాఖ 2025-26 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. మానవత సేవల్లో తాను కూడా భాగస్వామిగా ఉంటానని చెప్పారు. తనవంతుగా రూ.పది వేలు విరాళం అందజేశారు. శాంతి ర్యాలీ జిల్లా ఛైర్మన్ గమిని రాంబాబు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మానవత రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి మాట్లాడారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారిగా కడించర్ల రాజరాజేశ్వరరావు, కఠారి విశ్వనాథరాజు, వంగూరి హనుమంతరావుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కఠారి శారదాదేవి, బోయపాటి రామలక్ష్మి, ఎస్వీ సతీష్‌బాబు, ఆనందం మస్తాన్‌రావు, అరుణసారధి, అక్కిన కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం..

దువ్వ గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో రూ.70 లక్షల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శంకుస్థాపన చేశారు. ఆలయాలకు వచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, ఆలయ ఈవో పి.హరేరామ్ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో రామోజీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పించిన నాయకులు

రామోజీరావుకు ఘన నివాళి

భీమవరంటౌన్/ఆకివీడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మీడియా రంగంలో రాణించిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని పలువురు వక్తలు అన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రామోజీరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ సెక్రటరీ వబిలిశెట్టి రామకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష గురించి ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు రామోజీరావు అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరేటి ప్రకాష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, గంటా త్రిమూర్తులు, అరసవల్లి సుబ్రమణ్యం, కొండ్రు శ్రీనివాస్, ఎస్కే చాన్ బాషా, ఎన్‌సీసీ మేజర్ డాక్టర్ వీరయ్య, అమూల్యరావు, జి.మల్లేశ్వరరావు, పి.రాజబాబు, అడ్డగర్ల ప్రభాకర్‌గాంధీ, భూపతిరాజు బుజ్జిరాజు పాల్గొన్నారు. ఆకివీడు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాచేనమ్మకు 1,700 గ్రాముల వెండి అందజేత



ఆచంట, జూన్8(ఆంధ్రజ్యోతి): పెదమల్లం మాచేనమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం వెండి బిస్కెట్‌లను అందజేశారు. పోలవరానికి చెందిన ఎన్.పవన్‌జగదీష్ అనే భక్తుడు 700 గ్రాములు వెండి బిస్కెట్, మరో భక్తుడు వెయ్యి గ్రాములు వెండి బిస్కెట్‌లను ఆలయం వద్ద ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణకు అందజేశారు.

ఈడూరులో సుదర్శన హోమం

అత్తిలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : ఈడూరులో గల వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా సుదర్శన హోమాన్ని ఆదివారం నిర్వహించారు. కలిదిండి మాధవ మహేష్‌వర్మ దంపతులచే ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. వేంకటేశ్వర కథాగానం, చోరోత్సవం, గరుడ వాహన సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



ముత్యాలమ్మ ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

బండి ముత్యాలమ్మ సన్నిధిలో భక్తులు కిటకిట

» జాతర సందర్భంగా వాహన రాకపోకల మళ్లింపు

మొగల్తూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి జాతర సోమవారం జరుగుతుండడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆదివారం ముత్యాలపల్లి తరలివచ్చారు. ఆలయంలో నాలుగు క్యూలైన్‌లు ఏర్పాటుచేసి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, పెద్దలు, సిబ్బంది భక్తులకు సదుపాయాలు కల్పించారు.

ట్రాఫిక్ మళ్లింపు..

మూడేళ్లకు ఒకసారి నిర్వహించే బండి ముత్యాలమ్మ జాతర సందర్భంగా ముత్యాలపల్లి వంతెన నుంచి కొత్తోట వరకూ జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించిపోతాయి. దీనితో 216 జాతీయ రహదారి మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. జిల్లాలో దిగమర్రు నుంచి మచిలీపట్నం వైపు వెళ్లేవాహనాలను దిగమర్రు, పాలకొల్లు, భీమవరం, లోసరి మీదుగా మచిలీపట్నం వరకు, మచిలీపట్నం నుంచి నరసాపురం వైపు వాహనాలు ముత్యాలపల్లి సెంటర్ మీదుగా వారతిప్ప, వెంప, కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి మీదుగా నరసాపురం వైపు మళ్లించారు. పాలకొల్లు నుంచి నరసాపురం మీదుగా మచిలీపట్నం వెళ్లే వాహనాలు పాలకొల్లు నుంచి భీమవరం మీదుగా లోసరి నుంచి మచిలీపట్నం వెళ్లేలా ట్రాఫిక్ డైవర్షన్ చేశారు.



ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నీలాద్రిపురంలో 'వికసిత్ కృషి అభియాన్'

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాస్త్రవేత్తలు, రైతులతో వికసిత్ కృషి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవి వరప్రసాదరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించగా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పాం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు సాగుదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు, గ్రామస్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం విజేతలకు బహుమతులు

పాలకొల్లు రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి) : పాలకొల్లులోని త్యాగరాజ భవనంలో హైషా పరివార్ క్లబ్ ఎ టు జడ్ పెయింట్స్ ఆధ్వర్యంలో గత ఆరు ఆదివారాల నుంచి పిల్లలకు ఉచిత చిత్రలేఖన తరగతులు విజయవంతంగా నిర్వహించారు. చిత్రలేఖనం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ సభ్యులు బొప్పె దుర్గాప్రసాద్, అధికారి పవన్, సమతం వీరభద్రం, ఏకే కోట మల్లేశ్వరరావు, నక్కా వెంకట్, కె.భాస్కరరావు, రామారావు, బుడితి, వేంద్ర శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

పోడూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు అన్నారు. వద్దిపర్రు గ్రామంలో ఆదివారం జరిగిన టీడీపీ కార్యకర్తలు, సాధికార, సేవామిత్రల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. సర్పంచ్ వద్దపాటి రాజేంద్రప్రసాదు, ఎంపీటీసీ విప్పర్తి శారద, క్లస్టర్ ఇన్‌చార్జి శీలం శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు మైగాపుల శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ ఇన్‌చార్జి కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరాటే శిక్షణలో బహుమతులు అందుకున్న విజేతలు

కరాటే విజేతలకు బహుమతులు అందజేత

ఆకివీడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇండియా నేతృత్వంలో మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ శిక్షణ ముగింపులో విజేతలకు బెల్ట్ గ్రేడింగ్ కాంపిటీషన్ ఆదివారం నిర్వహించారు. వేసవి సెలవులలో ఆట పాటలకే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంగా ఉండడానికి వ్యాయామం చేయడం ఎంతో ఉపయోగపడుతుంది. స్థానిక శారద ఇంగ్లీషు మీడియం హైస్కూల్ యాజమాన్యం, పిల్లల తల్లిదండ్రుల సహకారంతో ఏప్రిల్ 25 నుంచి జూన్ 8 వరకు 50 మంది చిన్నారులకు శిక్షణ అందించారు. ఈ చిన్నారులు కలర్ బెల్ట్స్ సాధించారు. మూడేళ్ల చిన్నారులు ఆలేటి, ఈక్షిత, నాలుగేళ్ళ చిన్నారులు నందమూరి, వేద వర్షిణి కరాటేతో అబ్బురపరిచి ఎల్లో అండ్ ఆరెంజ్ బెల్ట్‌లు పొందారు. కరాటే కోచ్ గంటా శ్రీను, స్కూల్ డైరక్టర్ వంశీ ఉన్నారు.

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సంచార శకటంతో వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, నిమ్మగడ్డ అచ్యుతరామయ్య మంచానికి పరిమితమైన వృద్ధులకు తణుకు, ఉండ్రాజవరం ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురికి సేవలందించారు. సభ్యులు కె.రామ్మోహనరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, గిరిజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రవచనానికి హాజరైన కలెక్టర్ నాగరాణి, భక్తులు.. ప్రవచనం చేస్తున్న ప్రవ్రాజిక భవానీ ప్రాణ మాతాజీ

నేడు నివేదిత విద్యాలయం ప్రారంభం

కాళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించిన నివేదిత విద్యాలయం సోమవారం ఉదయం ప్రారంభిస్తామని సేవాసమితి సంస్థ ప్రతినిధి వేగిరాజు శివవర్మ తెలిపారు. దీనిలో భాగంగా వివేకానంద సేవా సమితి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనంలో గుంటూరు శారదా మఠం అధ్యక్షురాలు ప్రవ్రాజిక భవానీ ప్రాణ మాతాజీ మాట్లాడారు. శారదాదేవి ఆధ్యాత్మిక మార్గంలో ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారని, నేటి తరానికి ఆమె ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అతిథిగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో అందరూ నడుచుకోవాలన్నారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి, రామకృష్ణ మిషన్ పాలకవర్గ సభ్యురాలు డాక్టర్ లింగారెడ్డి ఉమాదేవి, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

చదువు పేరుతో వ్యాపారం : ఎస్ఎఫ్ఐ నేత

భీమవరం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా చదువు పేరుతో వేల, లక్షల కోట్ల రూపాయలు దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చదువునే వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విపరీతంగా పెరిగిపోయాయని, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఆకివీడు, ఉండి, పాలకొల్లు, ఆచంట ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధిక ఫీజులతో, పుస్తకాల పేరుతో లక్షల కోట్ల రూపాయలు దందా చేస్తున్న అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వదిలి చదువుపేరుతో వ్యాపారం చేసే విద్యా సంస్థలపై చర్యలు తీసుకుని పాఠశాలల గుర్తింపురద్దు చేయాలని, లేనిపక్షంలో రాబోవు రోజుల్లో ప్రతి మండల, నియోజకవర్గంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రొయ్యల కంపెనీ పైప్‌లైన్ నిర్మాణం.. అడ్డుకున్న స్థానికులు

» మరోసారి పనులు నిలుపుదల చేసిన పంచాయతీ కార్యదర్శి



పైప్‌లైన్ వేస్తున్న వారితో మాట్లాడుతున్న కార్యదర్శి

పాలకోడేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పాలకోడేరులో రొయ్యల కంపెనీకి వేస్తున్న భారీ పైప్‌లైన్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. గొల్లలకోడేరు వంతెన వద్ద నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారిని చేర్చి ఎక్స్‌కవేటర్‌తో తవ్వి అందులో నుంచి రెండు, నాలుగు అంగుళాలు కలిగిన పైపులను వేస్తుండడంతో అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు పంచాయతీకి ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి పనులను నిలుపుదల చేయించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం పనులను నిలిపివేసి ఆదివారం మళ్లీ పనులు మొదలుపెట్టారు. గ్రామస్థులు మరోసారి పంచాయతీ కార్యదర్శి గోపికి ఫిర్యాదు చేయడతో ఆయన ఆ ప్రాంతానికి వెళ్లి పనులను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఫ్యాక్టరీ సిబ్బంది అనుమతులు ఉన్నాయని చెప్పే ప్రయత్నం చేశారు. కార్యదర్శి మాట్లాడుతూ గ్రామస్థులు కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, వారి నుంచి అనుమతులు వస్తే పనులు చేసుకోవాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

జిల్లా వడ్రంగి పనివార్ల సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

భీమవరంటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు చిట్టిమోజు భోగేశ్వరరావు, కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖర్, కోశాధికారి లక్కోజు సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు అరసవల్లి రామచంద్రరావు, వెంకటపు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు చింతోజు పాండు రంగాచార్యులు, ములగాడ ప్రసాద్ కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ వడ్రంగి పనివారల సభ్యులకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు భోగేశ్వరరావు, కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 24 లక్షల మంది కార్పెంటర్‌లున్నారని, సంఘానికి కార్పొరేషన్ ఇచ్చి తద్వారా సబ్సిడీలతో ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

'పని గంటల పెంపు అధికారం ప్రభుత్వానికి లేదు'

భీమవరంటౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పని గంటలు పెంచే అధికారం, మహిళా ఉద్యోగులకు నైట్ షిఫ్టులు వేసే అధికారం ప్రభుత్వానికి లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఉద్యోగ కార్మిక వర్గాల ఎనిమిది గంటల పనివేళలను పది గంటలకు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించి, ఉత్తర్వులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద కార్మికులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో మహిళలు పనిచేయాలని కార్మిక చట్టాలు సవరణలు చేసే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. నాయకులు పి.యాకోబు, పాలా త్రిమూర్తులు, నాయుడు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు మహిళలను తరలిస్తున్న ముఠా గుట్టురట్టు

» పోలీసుల అదుపులో నిందితుడు

శంషాబాద్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు మహిళలను అక్రమంగా తరలిస్తున్న ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈ ఘటనలో ఓ మాజీ హోంగార్డును విజిటింగ్ వీసాలపై ఉపాధి కోసం నిరుద్యోగులను విదేశాలకు పంపుతున్న కేసులో ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు మస్కట్‌లో ఉపాధి కోసం వెతుకుతుండగా వారి పత్రాలను పరిశీలించిన శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్ అధికారులు వారి దగ్గర విజిటింగ్ వీసాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే ప్రాంతానికి చెందిన సత్యనారాయణ గతంలో హోంగార్డుగా పని చేసే వాడు. ఇటీవల ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన సుందరం అనే వ్యక్తి ద్వారా ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వ్యక్తులను తప్పుడు మార్గాల్లో పంపి డబ్బులు సంపాదించే పనిలో పడ్డాడు. ఉపాధి వీసాలకు డబ్బుల ఖర్చుతో పాటు కఠినమైన నిబంధనలు ఉండడంతో వారిని విజిటింగ్ వీసాల్లో విదేశాలకు పంపుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇప్పటికే పలువురిని పంపిన వారు తాజాగా శనివారం మస్కట్‌లో ఉన్న ఏజెంట్ సుందరం ఏర్పాటు చేస్తున్న రోల్డ్ గోల్డ్ అండ్ ఫ్యాన్సీ సెంటర్‌కు శాంపిల్ రోల్డ్ గోల్డ్ అభరణాలు పంపే ప్రయత్నంలో సత్యనారాయణను ఆర్‌జీఐఏ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు గల్ఫ్ దేశాలకు పీవోఈ సర్టిఫికేట్ లేకుండా మహిళలను అక్రమంగా పంపించేందుకు కొత్త మార్గాలు అన్వేషిస్తున్న హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠాకు చెందినవాడని వెల్లడైంది. సుందరం ఒక్క మనిషిని పంపించేందుకు రూ.1 లక్ష 50వేలు గల్ఫ్ దేశాస్థుల నుంచి తీసుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసుతో విషయం బయటపడడంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అతడి దగ్గర ఉన్న రోల్డ్ గోల్డ్ శాంపిల్ అభరణాలు, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు తారకరామ్ కళావేదికకు భూమిపూజ

ఆకివీడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ట్రిపుల్ ఆర్ ఉద్యానవనంలో కెనరా బ్యాంకు సీఎస్ఆర్ ఫండ్స్‌తో రూపుదిద్దుకుంటున్న నందమూరి తారకరామ్ కళావేదికకు సోమవారం డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు భూమిపూజ చేయనున్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగరాణి, కెనరాబ్యాంక్ ఎండీ కలిదిండి సత్యనారాయణరాజు హాజరవుతారు.

ఘనంగా గోగులమ్మ జాతర

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని కడకట్ల గోగులమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు నైవేద్యాలు సమర్పించారు.

అత్తిలి బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగబాబు ప్రమాణ స్వీకారం

అత్తిలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అత్తిలి బీజేపీ మండల అధ్యక్షుడిగా మామిడిశెట్టి నాగబాబు ప్రమాణ స్వీకారం చేశారు. అత్తిలి లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, బాల మహేష్, తోట త్రిమూర్తులు, రామిశెట్టి అయ్యప్ప, బండి సోమేంద్ర కూటమి నాయకులు పాల్గొన్నారు.

120 మందికి ఉచిత వైద్య పరీక్షలు

భీమవరం అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం వసుధ ఫౌండేషన్,మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ పెనుమత్స సత్యవెంకటరాజు వైద్య సహాయం అందించగా పెన్మెత్స రామ్మోహనవర్మ పేషెంట్లకు ఉచితంగా మందులు అందించారని తెలిపారు.

పొన్నపల్లి రామకృష్ణారావు మృతి

నరసాపురంటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎన్ కళాశాల మాజీ కోశాధికారి డాక్టర్ పొన్నపల్లి రామకృష్ణారావు మృతి చెందారు. విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, ఆండే సతీష్, ధవేజీ, పోలిశెట్టి రఘురాం, బళ్ల వెంకటేశ్వరావు నివాళులర్పించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

నరసాపురం, జూన్ 8 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని మొగల్తూరు రోడ్డులోని పెద్దచర్చి వద్ద ఆదివారం రాత్రి లారీ ఢీకొని కె.జాన్‌పాల్ (52) దుర్మరణం చెందాడు. మృతుడు పట్టణంలోని 31వ వార్డు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ యాదగిరి తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనుగొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నడిపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ఆదివారం జరిపిన దాడులలో మద్యం విక్రయిస్తున్న పుల్ల శ్రీను అనే వ్యక్తిని అరెస్టు చేసి, నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.